# సంతాప సభ

ఓగేటి శివరామకృష్ణ

దేశంకోసం తుట్టతుదవరకూ పోరాడి, దేశస్వాతంత్ర్యం తీసుకొనివచ్చిన వ్యక్తుల్లో ఒకరైన వెంకట్రామయ్యగారు మరణించారు. ఆయనపేరు విన్న పెద్దలూ మధ్యరకం నాయకులూ, విచార సానుభూతిని, వారి కుటుంబానికి ఉత్తరాల ద్వారా, టెలిగ్రాములద్వారా, ముఖం చూపించటంద్వారా జరిపారు. పత్రికలో కొన్ని సంతాప ప్రకటనలు-నాయకులగురించికూడా పడినాయ్.

దేశంలో అన్నిమూలలనుండి యీ విధంగా సంతాపసభలు జరుగుతూంటే, సంతాపతీర్మానాలు వచ్చిపడుతూంటే— వెంకట్రామయ్యగారి స్వపట్టణంలో మాత్రం — అయిదారురోజుల వరకూ ఏమీలేదు సరిగదా. .వారి కుటుంబాన్ని చూచివచ్చినవారయినా లేకపోయారు.

కానయితే— పత్రికాప్రకటనలు— ఉత్తరాలు, బయట ప్రదేశాలనుంచి వచ్చిపోతున్న స్నేహితుల బంధువుల రాకపోకలు ఊరివారిని కొంచెం మనస్సును మార్చివేసాయ్. కొందరు పట్టణ పెద్దలు కలసి .. వెంకట్రామయ్యగారి స్మారకసభ యేర్పాటు చేయడానికి నిశ్చయించుకొన్నారు. ఆ సభలో తమకు తెలిసిన విషయాలు-వెంకట్రామయ్యగారినిగురించి మాట్లాడ నిశ్చయించుకొన్నారు.

వెంకట్రామయ్యగారి సంతాపసభ జరుగుతుందనీ...అందులో వెంకట్రామయ్యగారి త్యాగాన్నీ వారి కుటుంబానికి సంబంధించిన విషయాల్నీ మాటాడవలసియుంటుందనీ...వచ్చిమాట్లాడి యెవరికి వారు సానుభూతి తెలియచేసి కుటుంబానికి తగిన సహాయం చేయవల్సిందనీ-ప్రకటనలు ప్రచురింపించి .ఊరంతా పంపించారు; గోడల కంటించారు...ఇంకా యేమో చేశారు.

'నివురుగప్పిన నిప్పువిధంగా...ఆ పట్టణవాసులకు యిదివరకు కన్పించే వెంకట్రామయ్యగారు - ఆ దినంమాత్రం...అందరి నోళ్ళలోనూ మసిలారు .చచ్చిన ఆయన ... యీ విషయం తెల్సుకొని కొంచెం సంతోషించియుంటాడేమో కూడా !

గ్రామస్థులంతా మహాసభకు హాజరై-వెంకట్రామయ్యగారి యెదుట...తమకు గల గౌరవాన్ని తెలియపర్చుకొన్నారు. అయితే మాట్లాడే వ్యక్తులే ఆ మహాసభలో లేకపోయారు .. మొత్తంమీద ఒకరిద్దరు మాట్లాడుతామన్నారు; అధ్యక్షపీఠం అలంకరించే వ్యక్తి యేం మాటాడాలో యేమో చెప్పవల్సిందని తన అంతరంగిక మిత్రుడ్ని—కోరాడు.

మొత్తం మాట్లాడేవారు నలుగురయిదుగురు తేలారు. వాళ్ళల్లా వాళ్ళు—మాట్లాడే విషయాలు తమలో తాము మననంచేసుకొంటూంటే—సభ ప్రారంభమైంది. ఒక ప్రజాభిమాని లేచి యీ విధంగా అన్నాడు· 'దేశభక్తులు—మన గ్రామవాసులూ ... వెంకట్రామయ్యగారు మరణించటం—మనకెంతో విచారకరం. ఈ విచారసమయంలో వారికి—యీ మాత్రం సానుభూతి చూపి—వారి ఆత్మశాంతికోసం ప్రార్థించటంకంటే మరి నే చేయతగింది లేదు !'

దేశభక్తుడొకాయన లేచి అన్నాడు. 'నిజంగా వెంకట్రామయ్యలాంటి దేశభక్తులు...భరతమాత కడుపున పుణ్యంవల్ల జన్మించారు. వారి

మూలకంగానే యీ స్వాతంత్ర్యం మనం పొందేమంటే అతిశయోక్తి యేమీ లేదు. ఆయన రెండు మార్లు జైలుకెళ్ళారు. ఆయనా నేనూ ..ఒకే గదిలో ఉండేవాళ్ళం. 42 ఉద్యమంలో యిరువురం లాఠీదెబ్బలకు గురయ్యాం. అలాంటి యోధుడు-మరికొంతకాలం బ్రతికియున్నట్లయితే, మరి మనం ఆనందం అనుభవించేవాళ్ళం. ఆయన ఆత్మశాంతికోరటం — దుఃఖంలో ఉన్న వారి కుటుంబానికి సానుభూతి చూపటం కంటే మరి చేయతగింది లేదు! ఇంతటితో విరమిస్తున్నాను."

బురఖా వేసుకొని పైకివస్తున్న ఒక శెట్టిగారు చెప్పారు. "నేను వెంకట్రామయ్యగార్ని బాగా యెరుగుదును. ఆయన దేశానికి చేసిన ఆపారం . నిజంగా— నల్లబజారు కొద్దోగొప్పో —తగ్గిందంటే— ఆయనే కారణభూతుడుగా మీరు గ్రహించండి, ఆయన చనిపోటం మీద ప్రజానీకానికి చాలా నష్టం. అంతకన్న మరి నే చెప్ప తగ్గది యేం లేదు' అని.

ఒక కవీశ్వరుడు యీ విధంగా అన్నాడు, "నాయకుడు -శ్రీ వెంకట్రామయ్యగారు చనిపోటంతోటే, నా నడుము విరిగినట్టయింది... ఈ సమయంలో—ఆత్మశాంతి కోరుతూ ..యీ పద్యాన్ని వారి కర్పిస్తున్నాను' ..అంటూ ఒక పద్యాన్ని తాను వెంకట్రామయ్యగారిమీద రచించినది చదివి, తన బాధ వెడలబోసుకొన్నాడు.

బక్కచిక్కిన ఒక పేదకార్మికుడు లేచి అన్నాడు. వెంకట్రామయ్యగారియందు మీరంతా భక్తివిశేషాలుంచి మాట్లాడినందుకు యెంతో సంతోషం-వెంకట్రామయ్యగారిని అభిమానించే వ్యక్తుల్లో ఒకరి నవటంవల్ల నేనొక చిన్నసలహాను చెబుతున్నాను. నా యందు దయయుంచి-వీలుంటే దాన్ని ఆచరణలో పెట్టి—నాకానందం కల్గించండి. వెంకట్రామయ్యగారు దేశభక్తుడుగా పరమదారిద్ర్యం అనుభవించాడు, ఆయన రోజులు జరిగిపోయాయ్. మరి ఆయన కుటుంబం ఉంది. ఈ కటికరోజుల్లో వెనక ఆసరాలేని—వారికి ... మన పట్టణవాసులు.. స్మారకనిధిప్రోగుచేసి — వచ్చిన మొత్తంవారి కుటుంబానికి యిచ్చినట్లయితే యెంతో బాగుంటుంది, వెంకట్రామయ్యగారి ఆత్మశాంతించుతుంది ..వారి కుటుంబం యితరత్రా వెదుక్కోవలసిన అవసరం ఉండదు.

మన...యీ సభలో యెంతమందో పెద్దలున్నారు, వ్యాపారుల్లున్నారు, మర్వాడీలున్నారు...దొరలున్నారు. చేయూత అందరకూ ఇచ్చే మా కార్మికుల మున్నాం. మాది చివరి చేయ్యి. కాని అన్నివిధాలా-పై వర్గాలవారికి తగిన సహాయం చేయటానికి మేం యెప్పుడూ సిద్ధమే. విషయం యోచించండి' అని.

కార్మికుని మాటలు వినటంతోటే సభలో కలకలం రేగింది—ఒకరితో ఒకరు మాట్లాడుకోటం ప్రారంభించారు; వ్యాపారులు, బొజ్జలు పెరిగిన మార్వాడీ అయ్యలూ—కార్మికుని వైపు తీవ్రంగా చూడసాగారు. కొంతమంది మంచి అభిప్రాయం యిచ్చావ్ బాగుంది' అన్నారు

కానయితే ఆ విషయం పట్టించుకోనట్లుగా-'అ'కారాలకు - అధికారయిన... అధ్యక్షులవారు 'శ్రీ వెంకట్రామయ్యగారినిగూర్చి యెంతోమంది మాట్లాడారు. ఎంతో ఆనంద-గా ఉంది. ఈ విషయంలో-నన్ను అధ్యక్షులుగా ఉండమని కోరటం కేవలం - నా అదృష్టమే ! నాకు యీ దినమే విజయవాడ వెళ్ళేపని ఉంది. కాని వారి యందుగల భక్తివల్ల —ప్రయాణాన్ని వదలివచ్చాను. స్నేహితునిగా — నా విధి నిర్వర్తించుకొన్నాను. అంతకన్న మనం చేసేది లేదు, వెంకట్రామయ్యగారిని గురించి యింతకుపూర్వం చాలా మాట్లాడారు. మరి నే చెప్పవలసింది లేదు. ఏమయినా చరిత్రచరణమే-కాలం-పాడు చేయటం—అందువల్ల సభ ముగింపుచేస్తున్నా'—

వెళ్ళిపోతూ సభికులు .. తెల్ల మొఖాలు వేస్తూంటే ..నాయకులమని చెప్పుకొంటున్న వ్యక్తులు 'రెండుగంటలు వేస్టనుకొంటూంటే— యేమిటో యోచిస్తూ కార్మికుడుమాత్రం అక్కడే ఉండిపోయాడు !